

'మొదటికే మోసం!'

నామినేటెడ్ పోస్టుల భర్తీలో సీఎం చంద్రబాబు వివక్ష చూపించారని కూటమి నేతలు మండిపడుతున్నారు.

- 8లో



పక్కా ఇళ్లకు 'కిక్ స్టార్ట్'

జిల్లాలో పక్కా ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు కిక్ స్టార్ట్ పేరిట సదస్సు నిర్వహించనున్నారు.

- 8లో



చోరీ చేసిన కార్లను..

చోరీ చేసిన కార్లను మెకానిక్ షాపులో ఉంచి తక్కువ ధరకు విక్రయిస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా శాంతి హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని 16 కాళ్ల మండపంలో బుధవారం శాస్త్రోక్తంగా శాంతి హోమం నిర్వహించారు. స్వామివారి జన్మ నక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని వేద పండితులు 16 కాళ్ల మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్ ఆజాద్, అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

సేవలపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న అదనపు ఈఓ వెంకయ్య చౌదరి


తిరుమల : శ్రీవారి భక్తులకు అందుతున్న సేవలపై అభిప్రాయాలు సేకరించాలని టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరి కోరారు. బుధవారం తిరుమలలోని సేవాసదన్-2లో నిర్వహించిన సత్సంగంలో శ్రీవారి సేవకులనుద్దేశించి ఆయన మాట్లాడారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు సేవలందించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు భక్తుల అభిప్రాయాలను తెలుసుకుని తద్వారా మరింతగా మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు సహకరించాలన్నారు. అనంతరం ఈ-డిప్ విధానంలో శ్రీవారి సేవలకు డ్యూటీ కేటాయింపులు చేపట్టారు. కార్యక్రమంలో టీటీడీ చీఫ్ పీఆర్‌ఓ రవి, పీఆర్‌ఓ పి.నీలిమ పాల్గొన్నారు.ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి తిరుమల పర్యటన దృష్ట్యా పద్మావతి విశ్రాంతి గృహం, పాంచజన్యం, తదితర ప్రాంతాలను అదనపు ఈఓ పరిశీలించారు.

ఈస్ట్ సీఐ అదృశ్యం!

– బెంగళూరులో ఉన్నట్లు సమాచారం

తిరుపతి క్రైమ్: నగరంలోని ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐ మహేశ్వర్ రెడ్డి మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదని తెలిసింది. వివరాలు.. సీఐ మహేశ్వర్ రెడ్డి మంగళవారం రాత్రి దేవేంద్ర థియేటర్ సమీపంలోని శ్మశాన వాటిక వద్దకు ప్రభుత్వ వాహనంలో చేరుకున్నారు. వేరే పని ఉందని, డ్రైవర్‌ని అక్కడే ఉండమని చెప్పి వెళ్లిపోయారు. అనంతరం ప్రభుత్వం ఇచ్చిన సెల్ నంబర్‌తోపాటు, సొంత నంబర్ కూడా స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. సీఐ ఎంతకూ రాకపోవడంతో డ్రైవర్ వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కంగారు పడిన ఉన్నతాధికారులు రాత్రంతా సీఐ ఆచూకీ కోసం ముమ్మరంగా గాలించారు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా, భవానీనగర్ వద్ద చివరగా కనిపించినట్లు గుర్తించారు. ఇంతలో బెంగళూరులో ఉన్నట్లు సీఐ కాల్ చేసి చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో క్యాజువల్ లీవ్‌లో బయట వచ్చానని సీఐ తెలిపారు. డ్రైవర్‌కి ఆ విషయం చెప్పానని అయితే అతను సరిగా అర్థం చేసుకోలేదని వివరించారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.45 కోట్లు



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,45,87,352 వచ్చినట్లు ఈవో ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద బుధవారం హుండీలోని కానుకలను లెక్కించినట్లు పేర్కొన్నారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 68 గ్రాములు, వెండి 412.200 కిలోలు, విదేశీ కరెన్సీ 3,452 వచ్చినట్లు పేర్కొన్నారు.

దేదీప్యం.. దివ్యరూపం

కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాల వెలుగులు.. కిక్కిరిసిన వీధులు.. తప్పెట్లు.. తాళాలు.. కనులపండువగా కళాకారుల ప్రదర్శనలు.. బాణసంచా పేలుళ్లు.. ఉత్సాహంగా కదంతొక్కిన యువత నృత్యాల నడుమ పోలేరమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. వెంకటగిరి పట్టణం జనసంద్రంగా మారిపోయింది. దేశవిదేశాల నుంచి తరలివచ్చిన బంధుమిత్రులతో ప్రతి ఇల్లూ కళకళలాడుతోంది. శక్తిస్వరూపిణి దివ్య రూపం వీక్షించేందుకు అశేష భక్త వాహిని బారులు తీరింది. పుట్టింటి నుంచి కదలిన అమ్మవారిని మనసారా సేవించుకుని పులకించింది. ఆలయం ఎదుట వేపమండపంలో కొలువుదీరిన గ్రామదేవతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంది.

- వైభవంగా ప్రారంభమైన వెంకటగిరి పోలేరమ్మ జాతర
- వేప మండల నడుమ చలువ పందిరిలో కొలువుదీరిన అమ్మవారు
- గ్రామదేవత దర్శనానికి పోటెత్తిన భక్తులు
- నేడు నగరోత్సవం.. నిమజ్జనం





అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు (ఇన్‌సెట్) నేత్ర రహితంగా పోలేరమ్మ ప్రతిమ



పోలేరమ్మ దర్శనానికి వేచి ఉన్న భక్తులు

వెంకటగిరి (సైదాపురం) : వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జనజాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. తల్లి దీవెనల కోసం పట్టణం భక్తజనసంద్రంగా మారింది. ఇసుకేస్తే రాలనంతగా ప్రజలు తరలివచ్చారు. జిల్లాతోపాటు ఇతర దేశాల నుంచి కూడా వెంకటగిరీయులు స్వగృహాలకు చేరుకున్నారు.

వేడుకగా మడి భిక్షాలు

పోలేరమ్మ జాతర సందర్భంగా వెంకటగిరిలోని ప్రతి వీధి కళకళలాడుతోంది. పోలేరమ్మకు మడి భిక్ష పెట్టండి.. పోతురాజుకు టెంకాయ కొట్టండి అంటూ భక్తుల చేస్తున్న నినాదాలు హోరెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే పట్టణంలోని ప్రతి ఇంట్లో పసుపుతో అమ్మవారి ప్రతిమను తయారు చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబలిని నైవేద్యంగా సమర్పించారు.

అప్రమత్తంగా విధులు

జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. ఊరేగింపు, నిమజ్జనంలో తొక్కిసలాటలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, నాగభూషణరావు, డీఎస్పీ రమణకుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర పండుగకు రూ.50లక్షలు

సాక్షి, అమరావతి : రాష్ట్ర పండుగ హోదాలో పోలేరమ్మ జాతర నిర్వహణకు దేవదాయశాఖ పరిధిలోని కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధుల నుంచి రూ. 50లక్షలను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఇన్‌చార్జి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.



జాతర శోభతో వెలిగిపోతున్న వెంకటగిరి

నేడు నిష్క్రమణం

జాతరలో భాగంగా గురువారం వేకువజామున అమ్మవారి నిలుపు కార్యక్రమం మొదలవుతుంది. అమ్మవారి మెట్టినిల్లు నుంచి అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీరుతారు. సాయంత్రం వరకు భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. సాయంత్రం అమ్మవారికి అత్యంత వైభవంగా నగరోత్సవం నిర్వహిస్తారు. అనంతరం విరూపమండపం వద్ద నిష్క్రమణ కార్యక్రమాలను పూర్తి చేస్తారు. దీంతో జాతర ఘట్టం పరిపూర్ణమవుతుంది.



ఆలయం వద్ద పుష్పాలంకరణ



అమ్మవారి రథం

వైభవంగా రథోత్సవం

పోలేరమ్మ పుట్టిల్లు అయిన కుమ్మరివీధిలోని ఇంటి వద్ద అమ్మవారి ప్రతిమను తయారు చేశారు. విగ్రహానికి నేత్రాలు అమర్చకుండా బుధవారం రాత్రి 7.30 గంటలకు భక్తుల దర్శనార్థం కొలువుదీర్చారు. అమ్మవారి ప్రతిమను తయారు చేసిన వెంటనే దర్శించుకుంటే మంచి జరుగుతుందన్న నమ్మకంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అత్యంత భక్తి శ్రద్ధలతో పోలేరమ్మను దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రథంపై అమ్మ ప్రతిమను కొలువుదీర్చి జీనిగలవారి వీధికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ తల్లిని ప్రతిష్ఠించి సంప్రదాయబద్ధంగా గాలి గంగులకు పూజలు నిర్వహించారు. అనంతరం బలి కార్యక్రమం ముగిసిన తర్వాత అమ్మవారి ప్రతిమకు కళ్లు అమర్చారు. బుగ్గచుక్కను తీర్చిదిద్దారు. దివ్యతేజస్సులో అలరారుతున్న పోలేరమ్మ దేదీప్య స్వరూపాన్ని రథంలో వైభవంగా ఊరేగిస్తూ పాత కోట మీదుగా అమ్మవారి ఆలయం వద్దకు చేర్చారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన వేప మండపంలో మహిమాన్విత ప్రతిమను ప్రతిష్ఠించారు. వేకువజాము నుంచే పోలేరమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు.

ఓటమి భయంతో వాయిదా

అధికారం మత్తు తలకెక్కిన కూటమి నేతలు ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇస్తున్నారు. అలవాటు ప్రకారం ఓటుకు నోటు సిద్ధాంతంతో నిబంధనలను తుంగలో తొక్కేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులను గుప్పిట్లో పెట్టుకుని రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు. తిరుపతి అభివృద్ధికి అవసరమైన స్టాండింగ్ కమిటీ ఏర్పాటుకు మోకాలడ్డుతున్నారు. కూటమి నేతల ఆదేశాల మేరకు కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. అందులో భాగంగా నగర మేయర్‌కు సైతం సమాచారం లేకుండా కౌన్సిల్ ఎన్నికను వాయిదా వేసేశారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు అందుబాటులో లేకుండా ముఖం చాటేశారు.

- స్టాండింగ్ కమిటీ ఎన్నికకు 'కూటమి' వెనుకడుగు
- ఒత్తిడికి తలొగ్గిన కార్పొరేషన్ అధికారులు
- మేయర్‌కు సైతం సమాచారం లేకుండా ప్రకటన
- బేరసారాలు సాగించేందుకే కాలయాపన?
- కమిషనర్ తీరుపై మండిపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు



నామినేషన్ వేసే ముందు భూమన ఆశీస్సుల కోసం వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు కూటమి ప్రభుత్వం మోకాలడ్డింది. మెజారిటీ కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీ వైపు ఉండటంతో ఓటమి తప్పదని గ్రహించి ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. గత స్టాండింగ్ కౌన్సిల్‌కు ఏడాది కాలపరిమితి ముగిసింది. దీంతో ఇటీవలే మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ 19 నుంచి 26వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 4వతేదీన ఎన్నిక నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో బుధవారం తిరుపతి నగర పాలక కార్యాలయానికి నామినేషన్ వేసేందుకు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు చేరుకున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగాల్సి ఉంది. సమయం మించిపోతున్నా కమిషనర్, అడిషనల్ కమిషనర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్ అందుబాటులో లేకపోవడంతో కార్పొరేటర్లు అవాక్కయ్యారు. మేయర్ శిరీష వెంటనే కమిషనర్ మౌర్యకు ఫోన్ చేయగా, ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఆమె తెలిపారు. దీనిపై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా ఎలా వాయిదా వేస్తారని కమిషనర్‌ను నిలదీశారు.

ప్రోటోకాల్ సాకు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4వ తేదీన ప్రారంభమవుతాయని టీటీడీ సుమారు 4 నెలల క్రితమే ప్రకటించింది. బ్రహ్మోత్సవాల తొలి రోజున ముఖ్యమంత్రి తిరుమలకు వచ్చి ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ విషయాలు తెలిసినా కార్పొరేషన్ అధికారులు స్టాండింగ్ కమిటీ ఎన్నికను అక్టోబర్ 4వ తేదీ నిర్వహించాలని నిర్ణయించడంలో ఆంతర్యమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. తీరా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు నామినేషన్ వేసేందుకు వచ్చినప్పుడు ఎన్నికను వాయిదా వేస్తూ అందుకు కారణంగా సీఎం, డిప్యూటీ సీఎం తిరుపతి వస్తున్నారని చెప్పడంలో అధికారుల వైఖరి పలు అనుమానాలకు తావిస్తోందని ఆరోపిస్తున్నారు. కేవలం కాలయాపన కోసమే అధికారులు ఇలా వ్యవహరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈలోపు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను నయానో భయానో తమ వైపు తిప్పుకుని స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కూటమి నేతలు పన్నాగం పన్నినట్లు స్పష్టంగా అర్థమవుతోంది. ఈ విషయంలో కమిషనర్ తీరుపై హైకోర్టుకు వెళ్లాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తీర్మానించడం గమనార్హం.

అధికారుల తీరుపై ఆగ్రహం

స్టాండింగ్ కమిటీ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో మేయర్ శిరీషతో కలసి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. మేయర్ మాట్లాడుతూ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు తమకు ముందస్తుగా ఎలాంటి సమాచారం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమికి మెజారిటీ లేదనే..

కార్పొరేషన్‌కు 49మంది కార్పొరేటర్లు ఎన్నికయ్యారు. వీరిలో 4వ డివిజన్ అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి రాజీనామా చేయగా, 24వ డివిజన్ కార్పొరేటర్ హనుమంతునాయక్ అనారోగ్యంతో మరణించారు. దీంతో కార్పొరేటర్ల సంఖ్య 47కు పడిపోయింది. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో గెలవాలంటే 24మంది కార్పొరేటర్ల మద్దతు అవసరం. టీడీపీకి ఒక కార్పొరేటర్ మాత్రమే ఉన్నారు.సార్వత్రిక ఎన్నికల్లో మరో ఆరుగురు కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచి కూటమికి అమ్ముడు పోయిన విషయం విదితమే. మరో 10 మంది కార్పొరేటర్లు గోడమీద పిల్లిలా వ్యవహరిస్తున్నారు. వీరికి టీడీపీ, జనసేన నుంచి ఆఫర్లు లేకపోవడంతో గాలిలోనే ఉండిపోయారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీకి 30మందికి పైగా కార్పొరేటర్ల బలం ఉంది. దీంతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక నిర్వహిస్తే ఓటమి తప్పదని గ్రహించిన కూటమి ప్రభుత్వం అర్ధాంతరంగా ఎన్నికను వాయిదా వేయించింది. నగర అభివృద్ధికి అవసరమైన స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికను అప్రజాస్వామికంగా వాయిదా వేయించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలకు పాతర

నగరాభివృద్ధి జరగాలంటే స్టాండింగ్ కమిటీ ప్రతిపాదనలు కీలకం. ఏడాది కాల పరిమితితో కార్పొరేటర్లలోని ఐదుగురిని స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్లుగాఎన్నుకుంటారు. కమిటీ కాల పరిమితి ముగిసిన వెంటనే నూతన సభ్యులను వెంటనే ఎన్నుకోవాలి. 15 రోజులోపు స్టాండింగ్ కౌన్సిల్‌ను ఎంపిక చేసి సమావేశపరచాల్సి ఉంటుంది. అయితే కమిషనర్ నిబంధనలకు పాతర వేసి ఎన్నికను వాయిదా వేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

వెబ్‌సైట్‌లో ఎన్‌ఎంఎంఎస్ అప్లికేషన్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈ ఏడాది డిసెంబరు 8వ తేదీన జాతీయ స్థాయిలో నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ అప్లికేషన్లు ఉన్నట్టు డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి అక్టోబరు 3వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, వార్షికాదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న వారు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు ఆధార్ కార్డులో ఉన్నట్టు విద్యార్థి పూర్తి పేరు, పుట్టిన తేదీ, తండ్రి/తల్లి పేరు సరిగ్గా నమోదు చేయాలని తెలిపారు. దరఖాస్తుకు ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదని, పరీక్షకు హాజరయ్యేటప్పుడు అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని సూచించారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుమును ఆన్‌లైన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా చెల్లించాలని వెల్లడించారు. ''డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్'' అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు పూర్తి చేయాలని, తర్వాత ప్రింటెడ్ నామినల్ రోల్స్, ఎస్‌బీఐ కలెక్ట్ రసీదును డీఈఓ కార్యాలయంలో అక్టోబరు 14వ తేదీలోపు సమర్పించాలని తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలకు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లోనూ, అలాగే డీఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,616 మంది స్వామిని దర్శించుకున్నారు. 22,759 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామికి కానుకల రూపంలో హుండీలో రూ.3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 6 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే లోనికి అనుమతించబోమని పేర్కొంది.

ఔషధ రంగంలో ఫార్మసిస్టులు కీలకం



ఫార్మసీ విద్యార్థులతో ప్రతిజ్ఞచేయిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : ఆరోగ్య రక్షణకు ఔషధాలు అవసరమని, అలాగే ఔషధ రంగంలో ఫార్మసిస్టులు కీలకమని పలువురు వైద్య ప్రముఖులు వెల్లడించారు. బుధవారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం నిర్వహించారు. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు జి.సుభాషిణి, ఎం.రూతు, పద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.రంగనాయకులు, మహిళావర్సిటీ ప్రొఫెసర్ నాగరాజు, కృష్ణతేజ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేణుగోపాల్, మోహన్‌బాబు వర్సిటీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ బీపీ మల్లికార్జున ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రపంచ జనాభాకు అనుగుణంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయన్నారు. అయితే వైద్యుల కంటే రోగులకు ఫార్మసిస్టుల సేవలే అవసరంగా మారాయని వెల్లడించారు. ఫార్మా రంగంలో యువతకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫార్మసీ కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత మెడికల్‌షాపు యజమాన్యాలకు సర్టిఫికెట్లు అమ్ముకోవడం నేరమన్నారు. అంకాలజీడయాబెటీస్ రంగాల్లో ఫార్మసిస్టులు పెరగాలని కోరారు. కార్యక్రమంలో విష్వక్సేన మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ అధినేత కందూరి జనార్ధన్, రిటైర్డ్ సీనియర్ ఫార్మసిస్ట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఫార్మసిస్టులు బాలరాజు నాయుడు, పి.నాధముని, డాక్టర్ సింగమాల సుమన్, సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఎం.ధనుష్ పాల్గొన్నారు.





బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.77,710
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.7,054
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.93,500
రిటైల్ వెండి గ్రాము రూ.96.50

క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. వినాయక నగరలోని డిఫెన్స్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ యం పవన్ కుమార్, లీలా మహల్ సర్కిల్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఎం.కార్తీక్‌కు ఒక్కొక్కరికి 3 రోజుల జైలు, రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. అలాగే తిరుపతి పీకే లేఔట్ కు చెందిన ద్విచక్ర వాహనదారుడు ఎం.నరేష్, వైఎస్సార్‌జిల్లా, రెడ్డివారిపల్లెకు చెందిన సి. బాలాజీకి ఒక్కొక్కరికి 2 రోజులు జైలు, రూ.10వేల జరిమానా విధించారు. స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 26 మందికి రూ.10వేల చొప్పున జరిమానాను న్యాయమూర్తి విధించినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు వివరించారు.

రూ.17.5 లక్షలకు వాహనాల వేలం

తిరుపతి మంగళం : అక్రమంగా ఎర్రచందనం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను అటవీశాఖ అధికారులు బుధవారం వేలం వేశారు. మొత్తం 50 వాహనాలకు వేలం పాట నిర్వహించగా 45 అమ్ముడుపోయాయి. వాహనాల వేలం ద్వారా రూ.17.5 లక్షల ఆదాయం సమకూరినట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు.

ఏరు దాటాక తెప్ప తగలేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఆశ చూపి పనిచేయించుకోవడం.. అవసరం తీరా పక్కనపెట్టేయడం దశాబ్దాలుగా ఆయనకు అలవాటు. అధికారం కోల్పోయిన ప్రతిసారీ నేను మారాను అంటూ ఊదరగొట్టడం.. పీఠం ఎక్కిన తర్వాత పాతబాటలోనే నడవడం ఆయనకు రివాజు. ఇప్పుడు కూడా అదే సిద్ధాంతం అమలు చేస్తున్నారని టీడీపీ నేతలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలో దారుణంగా మోసం చేశారని ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఎంపీ.. ఎమ్మెల్యే సీటు త్యాగం చేసి పార్టీకి విధేయత ప్రదర్శించిన వారికి కూడా మొండిచేయి చూపారని మండిపడుతున్నారు. మనస్పర్థలు మరచిపోయి చిత్తశుద్ధితో కూటమి అభ్యర్థుల విజయం కోసం పనిచేసిన వారిని సైతం విస్మరించారని విమర్శిస్తున్నారు. ఈ క్రమంలోనే బడుగు బలహీనవర్గాలకు అన్యాయం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మొదటికే మోసం!

- నామినేటెడ్ పదవుల పందేరంలో వివక్ష
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు దక్కని చోటు
- ఎమ్మెల్యే, ఎంపీ సీటు త్యాగం చేసిన వారికి మొండిచేయి
- బాబు తీరుపై కూటమి నేతల అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, తిరుపతి : నామినేటెడ్ పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న వారికి సీఎం చంద్రబాబు షాక్ ఇచ్చారు. వంద రోజుల తర్వాత విడుదల చేసిన మొదటి విడత పదవుల పంపకాల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి, సీటు త్యాగం చేసిన వారికి హ్యాండిచ్చారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన జనసేన, బీజేపీ శ్రేణుల్లో ఒక్కరి కూడా కనీసం కమిటీల్లో సభ్యుడిగా కూడా అవకాశం దక్కకపోవడంతో ఆ పార్టీల నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సైతం చోటు దక్కలేదు. మంత్రి వర్గంలో తిరుపతి, చిత్తూరు జిల్లాలోని ఎమ్మెల్యేలకు స్థానం దక్కకపోయినా.. నామినేటెడ్ పదవుల్లోనైనా న్యాయం జరుగుతుందని అందరూ భావించారు. ఇందులోనూ చంద్రబాబు వివక్ష చూపించారని కూటమి నాయకులు లోలోపల రగిలిపోతున్నారు. మొక్కుబడిగా కేటాయించిన పదవుల విషయంలోనూ స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన వారికి మాత్రమే ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. తిరుపతి జిల్లా నుంచి రవినాయుడుకి శాప్ చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఊకా విజయకుమార్‌కి ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సభ్యుడిగా, చిత్తూరు జిల్లా కుప్పానికి చెందిన మునిరత్నంకి ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా, చిత్తూరు కార్పొరేషన్ మాజీ మేయర్ కఠారి హేమలతకి ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా, నగరికి చెందిన గంజి మాధవయ్యకు ఏపీ పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా అవకాశం కల్పించి చంద్రబాబు చేతులు దులిపేసుకున్నారు.

కఠారిని ఇంట్లో కూర్చోబెట్టేందుకే..!

చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నం చేశారు. అదే విధంగా మాజీ మేయర్ కఠారి హేమలత కూడా ఎమ్మెల్యేగా పోటీ చేయాలని, తనకే టికెట్ కేటాయిస్తారని ధీమాగా ఉన్నారు. చివరకు గురజాల జగన్‌మోహన్‌నాయుడుకి టీడీపీ అధిష్టానం టికెట్ కేటాయించింది. దీంతో సీకే బాబు, హేమలత అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే టీడీపీ అధినేత ఒత్తిడి చేయడంతోపాటు, పార్టీ అధికారంలోకి వసే ఏదో ఒక కార్పొరేషన్‌కి చైర్మన్ పదవి ఇస్తామని నచ్చజెప్పారు. ఈ క్రమంలో కఠారి హేమలత మాత్రం తనకు చిత్తూరు నగర మేయర్‌గా అవకాశం ఇవ్వాలని కోరారు. అందుకు అధినేత చంద్రబాబు కూడా సరే అని హామీ ఇచ్చినట్లు సమాచారం. దీంతో టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం సీకేబాబు, హేమలత తీవ్రంగా కృషి చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చింది మేయర్ పీఠం దక్కుతుందని భావించిన హేమలతకి ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యులుగా పదవి కట్టబెట్టి షాక్ ఇచ్చింది అధిష్టానం. ఇకపై ఆమెను ఇంటికే పరిమితం చేసే కుట్రలో భాగంగానే ఈ పదవి ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఇకపోతే మాజీ ఎమ్మెల్యే సీకే బాబుకి ఉన్నత పదవి వస్తుందని ఆయన వర్గీయులు ఆశగా ఎదురుచూశారు. మొదటి విడత పదవుల పంపకాల్లో సీకే బాబుకి మొండి చేయి చూపించారు. అదే విధంగా మరో మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, కాజూరు బాలాజీ, వసంతకుమార్ నాయుడు, చంద్రప్రకాష్ నాయుడు, సీఆర్ రాజన్ తదితరులకు తొలి జాబితాలో చోటు దక్కలేదు. కుప్పం నుంచి మునిరత్నానికి మాత్రం పదవి ఇచ్చి, పనిచేసిన ఎంతో మంది కుప్పం నేతలను విస్మరించారు. పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజక వర్గాల పరిధిలోని ఏ ఒక్క నాయకుడూ నామినేటెడ్ పదవుల పంపకాల జాబితాలో లేరు. నగరి నియోజక వర్గంలో వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీ గెలుపు కోసం పనిచేసిన రెడ్డివారి చక్రపాణిరెడ్డి, లక్ష్మీపతి రాజు, కేజే కుమార్, ఏలుమలై (అమ్ములు), మురళీధర్‌రెడ్డికి చివరకు నిరాశే మిగిలింది.

కష్టానికి ఫలితం శూన్యం

తిరుపతి జిల్లాలో టీడీపీ కోసం అహర్నిశలు పనిచేసిన వారు ఎంతో మంది ఉన్నారు. అయితే వారెవ్వరినీ కాదని కొట్టాలకు చెందిన రవినాయుడుకు శాప్ చైర్మన్, తిరుపతికి చెందిన ఊకా విజయకుమార్‌ను కార్పొరేషన్ సభ్యుడిగా నియమించారు. వీరిద్దరూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన దాఖలాలు లేవని టీడీపీ నేతలే ఆరోపిస్తున్నారు. కొట్టాలలో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన వారే గెలుపొందారు. ఊకా విజయకుమార్ నాలుగేళ్లుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని, కార్పొరేషన్ ఎన్నికల సమయంలో కూడా టీడీపీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసిన దాఖలాలు లేవని తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజక వర్గాల పరిధిలో ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ల ఆశించిన వారు అనేక మంది ఉన్నారు. టికెట్ దక్కని వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని ఆశ చూపించి ఎన్నికల్లో పనిచేయించుకున్నారు. కూటమి అభ్యర్థుల విజయం కోసం పనిచేసిన వారు అనేక మంది నామినేటెడ్ పదవులపై ఆశపెట్టుకున్నారు. అయితే ఎవరికీ నామినేటెడ్ పోస్టుల జాబితాలో చోటు దక్కకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రవినాయుడు, ఊకా విజయ్‌కుమార్‌కు సైతం స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు పదవులు కేటాయించినట్లు విశ్వసనీయ సమాచారం. మొత్తంగా మొదటి విడతలోనే సీఎం చంద్రబాబు తన మార్కు మోసం చేశారని జనసేన, బీజేపీ నేతలు మండిపడుతున్నారు.

తిరుమలలో తెలంగాణ గవర్నర్



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిప్యూటీ ఈఓ భాస్కర్

తిరుమల : శ్రీవారి దర్శనార్థం తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ బుధవారం సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. పద్మావతి అతిథిగృహం వద్ద ఆయనకు టీటీడీ డిప్యూటీ ఈఓ ఆర్1 భాస్కర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. గురువారం వేకువజామున తోమాల సేవ, అర్చన సేవలో శ్రీవారిని గవర్నర్ దర్శించుకోనున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయశేఖర్ పాల్గొన్నారు.

చోరీ చేసిన కార్లను తక్కువ ధరకు విక్రయించి..

- లక్షలు స్వాహా చేసిన మెకానిక్
- ఏ రకం కారుకైనా షెడ్‌లో విడి భాగాలు లభ్యం
- వేలూరు సమీపంలో 54 కార్లు స్వాధీనం
- ఆంధ్రా సరిహద్దుల్లోని చిత్తూరు, తిరుపతికి చెందిన కార్లే అధికం



నిందితుడు మెకానిక్ దేవకుమార్

వేలూరు: తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా గాంధీనగర్‌కు చెందిన దేవకుమార్ గుడియాత్తం రోడ్డులోని వెంకటసముద్రం వద్ద కారు మెకానిక్ షెడ్ నడుపుతున్నాడు. ఇతని షెడ్‌లో చోరీకి గురైైన కార్లను తక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఇటీవల పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో డీఎస్పీ పయణి, ఇన్‌స్పెక్టర్ ఆనందన్ విచారణ జరపగా మెకానిక్ దేవకుమార్ ఇదివరకే పలు చోరీ కార్లను విక్రయించినట్లు తెలిసింది. ఇతనిపై కాట్పాడి, పేర్నంబట్టు, మేల్‌పాడి పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నట్లు గుర్తించారు. ఇతని కారు షెడ్‌లో మొత్తం 54 కార్లు ఉన్నట్లు తెలిసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్టు చేశారు. పోలీసులు మాట్లాడుతూ దేవకుమార్ తమిళనాడుతో పాటు ఆంధ్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లోని చోరీ చేసిన ఏసీ కార్లను కంటైనర్‌ల ద్వారా తీసుకొచ్చి ఇంజన్, సీజ్ నెంబర్‌లను మార్చి వేసి రహస్యంగా తక్కువ ధరకు విక్రయం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. వీటి ద్వారా రూ. లక్షలు సంపాదించినట్లు గుర్తించామన్నారు. ఇతని కారు షెడ్‌లో ఏ రకం కారుకైనా విడి భాగాలు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న 54 కార్లలో 24 కార్లు సర్వీస్ కోసం వచ్చినట్లు దేవకుమార తెలిపాడని అయితే వాటికి సంబంధించిన ఎటువంటి ఆధారాలు అతని వద్ద లేదన్నారు. ఆ కార్ల యజమానులు తగిన ఆధారాలతో వస్తే అందజేసేందుకు సిద్ధమని ప్రకటించారు. స్వాధీనం చేసుకున్న కార్ల విలువ సుమారు రూ. 2 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. కార్లలో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, తిరుపతి వంటి ప్రాంతాల రిజిష్టేషన్‌కు చెందినవే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడ కొందరితో సంబంధాలు కొనసాగిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

పలువురు సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్: పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షీమూషీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు వేకెంట్ రిజర్వు (వీఆర్)లో ఉన్న సీఐ డి.మునస్వామిని పుత్తూరు రూరల్‌కు, అక్కడ ఉన్న ఎం.భాస్కర్‌నాయక్‌ను తిరుపతి వీఆర్‌కు పంపారు. తిరుపతి వీఆర్‌లో ఉన్న వి.చిన్నపెద్దయ్యను శ్రీసిటీకి, పి.శ్రీరాములును తిరుపతి డీటీఆర్‌బీకి, తిరుపతి ట్రాఫిక్‌లో ఉన్న కె.శ్రీనివాసులును ఈస్ట్ స్టేషన్‌కు, అక్కడ ఉన్న డి.మహేశ్వర్‌రెడ్డిని వీఆర్‌కు పంపించారు. తిరుపతి డీటీసీలో ఉన్న ఎ.శ్రీరాముడును తిరుమల టూటౌన్‌కు, అక్కడ ఉన్న ఎ.సత్యనారాయణను తిరుపతి వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

34 మంది ఎంపీడీఓలు బదిలీ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో 34 మంది ఎంపీడీఓలను బదిలీ చేస్తూ జెడ్పీ మాజీ సీఈఓ గ్లోరియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలు.

ఎంపీడీఓ	ప్రస్తుతం పనిచేస్తున్న మండలం	బదిలీ అయిన మండలం
1. ఇందిరమ్మ	పుత్తూరు	రామచంద్రపురం
2. అరుణ	నింద్ర	ఎర్రావారిపాళ్యం
3. ధనలక్ష్మి	పూతలపట్టు	ఐరాల
4. శివరాజు	యాదమరి	గుడిపాల
5. గంగయ్య	కలికిరి	కురబలకోట
6. తాజ్‌మాస్రూర్	గుడుపల్లె	మదనపల్లె
7.శ్రీనివాసులు	రామచంద్రాపురం	చిత్తూరు
8. మహమ్మద్‌రఫీ	వి.కోట	పిచ్చాటూరు
9.అబ్దుల్‌రహీమ్	పెద్దపంజాణి	కలకడ
10. చంద్రమౌళి	విజయపురం	కార్వేటినగరం
11. శేషగిరిరావ్	నిమ్మనపల్లె	వడమాలపేట
12.భానుమూర్తిరావ్	వడమాలపేట	కలికిరి
13.సురేంద్రనాథ్	తంబలపల్లె	తొట్టంబేడు
14.సురేష్‌బాబు	తొట్టంబేడు	గంగవరం
15.సుధాకర్	చౌడేపల్లె	కేవీపల్లె
16.బాలాజీ	పీటీఎం	పెద్దపంజాణి
17.అబ్దుల్‌కలాంఆజాద్	తవణంపల్లె	సోమల
18.అమర్‌నాథ్	ఎర్రావారిపాళ్యం	వెదురుకుప్పం
19.నాగరాజు	ఐరాల	పూతలపట్టు
20.హరినారాయణ	కురబలకోట	ములకలచెరువు
21.భానుప్రసాద్	మదనపల్లె	రామసముద్రం
22.పరమేశ్వరరెడ్డి	కలకడ	నిమ్మనపల్లె
23.మధుసూదనరెడ్డి	గంగవరం	రొంపిచెర్ల
24.ప్రేమ్‌రాజ్ కుమార్	వెదురుకుప్పం	శాంతిపురం
25.లీలామాధవి	నగరి	గుడుపల్లె
26.రామచంద్ర	కేవీబీపురం	తిరుపతిరూరల్
27.రమేష్‌బాబు	తిరుపతి రూరల్	రేణిగుంట
28.గిడ్డయ్య	ఏర్పేడు	చిన్నగొట్టిగల్లు
29.ఉపేంద్రరెడ్డి	పీలేరు	తంబళ్లపల్లె
30.శివశంకర్	బంగారుపాళ్యం	పీలేరు
31.విష్ణుచిరంజీవి	రేణిగుంట	పీటీఎం
32.బాలాజీనాయక్	చంద్రగిరి	నాగలాపురం
33.సౌభాగ్యమ్మ	వైఎస్సార్ జిల్లా	ఏర్పేడు
34.లక్ష్మీకాంత్	విజయనగరం	రామకుప్పం

పక్కా ఇళ్లకు 'కిక్ స్టార్ట్'



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు

తిరుపతి రూరల్ : జిల్లాలో పక్కా ఇళ్ల నిర్మాణం మందకొడిగా సాగుతోందని, అందుకే లేఅవుట్ల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నామని, పనులు వేగవంతం చేసేందుకు కిక్ స్టార్ట్ పేరిట ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని హౌసింగ్ పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం తిరుపతి రూరల్ హౌసింగ్ ఏఈ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం చంద్రగిరి ఇన్‌చార్జి డీఈ శ్రీరాములురెడ్డితో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద జిల్లా వ్యాప్తంగా 32,147 ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయన్నారు. 16,267 ఇళ్లు బేస్‌మట్టం లెవల్, 9,016 ఇళ్లు రూఫ్ లెవల్, 6,864 ఇళ్లు శ్లాబ్ లెవల్లో ఉన్నాయని వివరించారు. 2025 మార్చి నెలాఖరు నాటికి ఈ గృహాలను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

28న ప్రత్యేక సదస్సులు

లేఅవుట్లు, సొంత స్థలాల్లో పీఎంఏవై పథకం కింద ఇంటి నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులతో కిక్‌స్టార్ట్ పేరిట ఈ నెల 28న ప్రత్యేక సదస్సులను నిర్వహించనున్నట్లు పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయా లేఅవుట్లలో ఉదయం 10 గంటలకు, సొంత స్థలంలో ఇలు నిర్మించుకుంటున్న వారికి ఆయా సచివాలయాల పరిధిలో సాయంత్రం 3 గంటలకు సదుస్సులు ఉంటాయని వివరించారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం మంజూరు చేసిన ఇల్లు నిర్మించుకునే వారికి రూ.1.80 లక్షలు మాత్రమే అందిస్తామని తెలిపారు. కొంతమంది రూ.2.5లక్షలు ఇస్తారని ఇంటి పనులు నిలిపివేశారని, ఈ దిశగా ఎలాంటి ఆదేశాలు లేవని వెల్లడించారు. కొత్తగా హౌసింగ్ రుణాలు సైతం మంజూరు చేయడం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేయాలనే లక్ష్యం మాత్రమే పెట్టుకున్నట్లు వివరించారు.

అయోమయం.. గందరగోళం

- హాల్ టికెట్ లేకుండానే ఐసీడీఎస్ పరీక్షలు
- అధికారుల తీరుపై అభ్యర్థుల అసంతృప్తి



పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

తిరుపతి అర్బన్ : తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా ఐసీడీఎస్ పరిధిలోని 16 ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన పోటీ పరీక్షకు హాల్ టిక్కెట్లు లేకుండా పరీక్ష రాయించారు. ఈ క్రమంలో అభ్యర్థులను ఆధార్ కార్డును తెచ్చుకోవాలని ముందురోజు సూచించారు. ఆధార్‌కార్డులు చూపించిన వారిని హాల్లోకి అనుమతించారు. అయితే పరీక్ష ఉంటుందనే సమాచారాన్ని దరఖాస్తు చేసుకున్న 210 మందికి ముందుగా అధికారులు తెలియజేయలేదనే విమర్శలున్నాయి. కనీసం సిలబస్ వివరాలు, ఎన్ని మార్కులకు పరీక్ష ఉంటుంది.. ఎంత సమయం ఇస్తారు అనే సమాచారాన్ని అభ్యర్థులకు ముందుగా తెలియజేయలేదు. దీంతోనే వారంతా అయోమయానికి లోనయ్యారు. అధికారులకు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే గందరగోళంగా పరీక్ష నిర్వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమయపాలన లేదు

ఉదయం 9 గంటలకు పరీక్ష ఉంటుందని సమాచారం ఇచ్చిన ఐసీడీఎస్ అధికారులు మధ్యాహ్నం 12 గంటలకు ప్రశ్న పత్రం ఇచ్చి 12.30 వరకు నిర్వహించారని అభ్యర్థులు వెల్లడించారు. పరీక్షకు 30 నిమిషాల సమయం మాత్రమే ఇచ్చారని తెలిపారు. లెటర్ రైటింగ్‌కు 20 మార్కులు, ఎక్సెల్‌లో గణాంకాలకు 15 మార్కులు, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌కు 10 మార్కులు, తిరుపతి కార్పొరేషన్ సమాచారాన్ని ఇంటర్నెట్‌లో చూపడానికి 5 మార్కులు చొప్పున మొత్తం 50 మార్కులకు నిర్వహించినట్లు వివరించారు. అయితే సిలబస్ ముందుగా అభ్యర్థులకు తెలియకపోవడంతో గందరగోళానికి గురైనట్లు తెలిపారు. ఈ క్రమంలో 16 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారిలో 50శాతం మంది ఐసీడీఎస్‌లో సిబ్బందే వారే ఉన్నారని చర్చసాగుతోంది. అందుకే పరీక్షను గోప్యంగా ఉంచారని చెబుతున్నారు. మరోవైపు ఓ వ్యక్తి ఒక్కో పోస్టుకు రూ.లక్ష ఇవ్వాలని అభ్యర్థుల నుంచి నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పారదర్శకంగానే పరీక్ష

"పారదర్శకంగానే పరీక్ష నిర్వహించాం. 210 మందికి గాను 99 మంది మాత్రమే హాజరయ్యారు. మంగళవారం ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో సిలబస్ పెట్టాం. ఆ మేరకు అదే ప్యాట్రన్‌లో పరీక్ష చేపట్టాం. అందరికి ఒక్కరోజు ముందుగా సమాచారం ఇచ్చాం. పరీక్షలో మెరిట్ మార్కులు ప్రకారం పోస్టులు భర్తీ చేస్తాం.

– జయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, తిరుపతి

బూటకం .. జాతీయ విద్యావిధానం



మాట్లాడుతున్న ఏఐఎస్ఈసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానంతో చదువులు అందని ద్రాక్షలా మారాయని ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్రమణ్యం ఆరోపించారు. బాలాజీ కాలనీలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం 'జాతీయ విద్యా విధానంతో నేటి విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలు, మన ముందున్న కర్తవ్యాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యావిధానంతో పాఠశాల స్థాయిలో ప్రభుత్వ విద్యను పటిష్టపరుస్తున్నామని చెప్పడం బూటకమన్నారు. నాలుగేళ్ల డిగ్రీతో విద్యార్థులకు ఒరిగేదేమీ లేదన్నారు. ఇప్పటికే సెమిస్టర్ విధానంలో సింగిల్ మేజర్, మైనర్ సబ్జెక్టులు అంటూ డిగ్రీ విద్యను అస్తవ్యస్తం చేశారని దుయ్యబట్టారు. సీపీఎస్పీ, ఇంటర్‌షిప్ పేరుతో విద్యార్థులకు విషయ పరిజ్ఞానం అందకుండా చేసి డిగ్రీ వ్యవస్థ ధ్వంసం చేశారని విమర్శించారు. యూనివర్సిటీల్లో ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయకుండా, డిపార్ట్‌మెంట్లను మూసివేస్తున్నారని ధ్వజమెత్తారు. నేడు యూనివర్సిటీలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై విద్యాశాఖ మంత్రి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలన్నింటికీ ఒకే చట్టం తెస్తామని, బడా పారిశ్రామిక వేత్తలను బోర్డు గవర్నెన్స్‌లో సభ్యులుగా ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఏఐఎస్ఈసీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు ఏ.హరీష్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు, యువత విద్య ద్వారా పొందాల్సిన వ్యక్తిత్వ, నైతిక విలువలు, సంస్కృతి పూర్తిగా కనుమరుగుతున్నాయన్నారు. సమాజంలో డ్రగ్స్, మద్యం, పోర్నోగ్రఫీ వెబ్ సైట్లను ప్రభుత్వాలు పరోక్షంగా పెంచిపోషిస్తున్నాయని విమర్శించారు. ఫలితంగా మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు తక్షణమే డ్రగ్స్, పోర్నోగ్రఫీ, మద్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఈసీ నేతలు శ్రీకాంత్, అమీనా, విద్యార్థి సంఘం నేతలు మహేష్, నవీన్, డిల్లీ ,మహేశ్వర్, వెంకటేష్, బాలాజీ పాల్గొన్నారు.